విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 13, మార్చి 2025

15 నుండి క్షేత్రస్థాయిలో గృహ సిబ్బంది పర్యటన

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : బడుగు బలహీన వర్గాలకు చెందిన గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం నందు ఆయన మాట్లాడుతూ పిఎంఏవై కింద ఇల్లు మంజూరై కట్టుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల లబ్ధిదారులకు అదన సహాయాన్ని అందిస్తున్నదన్నారు. వివిధ కారణాలతో మధ్యలో ఇంటి నిర్మాణాలునిలిచిపోయిన లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసుకోవాలన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టి లబ్ధిదారులకు రూ.75వేలు అదనపు సహాయం అందుతుందన్నారు. అయా వర్గాల వారు వారి క్యాస్ట్ సర్టిఫికెట్లను మండల గృహ నిర్మాణ శాఖ అధికారులకు అందించాలన్నారు. మండలంలో బీసీ లబ్ధిదారులు 412 మంది, ఎస్సీ లబ్ధిదారులు 389 మంది, ఎస్టి లబ్ధిదారులు 35 మంది ఉన్నారన్నారు. ఈ నెల 15 నుండి 23వ తేదీ వరకు హౌసింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి లబ్ధిదారునికి అదనపు ఆర్థిక సహాయం గురించి తెలియజేస్తారన్నారు. ఈ నెల 20 నుండి అర్హత కలిగిన లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం వాటా పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని బడుగు బలహీన వర్గాల వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యథావిధిగా రాష్ట్ర వృషభ రాజముల పోటీలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 14, 15న వృషభ రాజముల పోటీలు యథావిధిగా జరుగనున్నాయని అహోబిలం గ్రామ రైతు కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే గంగుల తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం జరిగే ఈ రాష్ట్రస్థాయి వృషభ రాజముల పోటీలను మాజీ పార్లమెంట్ సభ్యులు గంగుల ప్రతాప రెడ్డి, కుటుంబ సభ్యులు ప్రారంభించనున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గంగుల కుటుంబ అభిమానులు పాల్గొని పోటీలను జయప్రదం చేయాలని వారు కోరారు.

ముగిసిన అకాడమిక్ ఆడిట్

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామ పరిధిలో గల జీటీఎంఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2023 -20 24, 2024 - 2025 రెండు సంవత్సరాల అకాడమీ ఆడిట్‌ను బుధవారం విజయవంతంగా ముగిసినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఇంద్రావతి తెలిపారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి భాస్కర్ రెడ్డి ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి కృష్ణ తదితరులు హాజరై అకాడమీ ఆడిట్ నిర్వహించగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. సోషల్ ఆడిట్‌తో పాటు కళాశాల పరిధిలో నిర్వహించిన పలు కళా సాంస్కృతిక జాబ్ మేళా నూతన కోర్సులు కంప్యూటర్ ల్యాబ్ సైన్స్ వంటి కోర్సులు ప్రవేశపెట్టి గ్రామీణ స్థాయిలో కార్పొరేట్ విద్యను అందిస్తున్న అని అభినందించారు. కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి హుస్సేన్ సాహెబ్ జనార్ధనుడు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - నందికొట్కూరు: నియోజవర్గ పరిధిలోని నెహ్రూ నగర్ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పదో తరగతి చదువుతున్న, 5 మంది విద్యార్థులకు బుధవారం గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు లోకానంద రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ నాయకురాలు మంద్రా ఉమా సహాయ సహకారాలతో టీడీపీ నాయకులు బండి జయరాజు సలహా సూచన మేరకు నందమూరి బాలకృష్ణ ఏమోక్షజ్ఞ సేవా సమితి అధ్యక్షులు బందారు శ్రీనివాసులు ఎగ్జామ్స్ పాడ్స్, పెన్నులు, పెన్సిల్, పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సభ్యులు ఫరూక్ బాష, ఉపాధ్యాయులు, శ్రీనివాసరెడ్డి, స్వామినాథమ్, విజయభాస్కర్, బెంజిమెన్, ఉపాధ్యాయురాలు, విజయకుమారి, భార్గవి, జయలక్ష్మి, పాల్గొన్నారు.

దివంగత నేత భూమా నాగిరెడ్డికి ఘన నివాళి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : దివంగత నేత భూమా నాగిరెడ్డి 8వ వర్ధంతి వేడుకలు పట్టణంలోని భూమా ఘాట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తన తండ్రి భూమా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి భూమా నాగిరెడ్డి ఆశయాలను, కార్యకర్తలకు ఇచ్చిన మాటలను నేను దగ్గర ఉండి నెరవేరుస్తానని, భూమా కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన మేము అండగా ఉంటామన్నారు. ఆళ్లగడ్డ ప్రజలు అమ్మనాన్నలు లేని లోటు తీరుస్తున్నారని, భావోద్వేగానికి గురయ్యారు. సినీనటుడు మంచు మనోజ్ తన భార్య భూమా మౌనిక తో కలిసి ఘాట్ వద్దకు చేరుకుని భూమా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

గిరిజన మహిళపై ఓ నాయకుడి దౌర్జన్యం

విశాలాంధ్ర - ప్యాపిలి: ప్యాపిలి పట్టణానికి చెందిన గిరిజన మహిళ చిట్యాల మనోరమ భర్త పేరు చిట్యాల ఎల్లప్ప ఎర్రగుంట్ల పల్లె గ్రామానికి చెందిన రమేష్ రెడ్డి అనే నాయకుడు భూమి సమస్యపై ఆమెను దౌర్జన్యంగా బెదిరింపులు చేస్తున్నారని, తక్షణమే అతనిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని రాష్ట్ర ఎస్టీ సంఘం అధ్యక్షులు రామచంద్రుడు, రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ, ప్రభాకర్, నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక ఏకలవ్య విగ్రహం నుంచి ర్యాలీతో బయలుదేరి సర్కిల్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మనోరమ మాట్లాడుతూ తమ సర్వే నెంబరు 293 నందు 7 సెంట్లు ప్లాటు డోన్ పట్టణానికి చెందిన మద్రి గోవిందరాజులుతో కొనుగోలు చేయడమైందని, రిజిస్టర్ చేయించుకు న్నామని, ఈ ప్లాటుకు ఎలాంటి సంబంధంలేని వ్యక్తి ఎర్రగుంట్లపల్లె గ్రామానికి చెందిన బత్తుల రమేష్ రెడ్డి రాజకీయంతో ఈ ప్లాటు నాది అని దౌర్జన్యం చేయడమైనది. స్థానిక రాజకీయ నాయకుల ద్వార కూడా చరవాణిలో భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. ఆ ప్లాట్ వదిలి వెళ్ళకపోతే చంపుతామని, తమ ప్లాట్ వద్దకు వచ్చి ఆయన ఈ ప్లాట్ వదిలి వెళ్లాలంటూ కులం పేరుతో దూషించారని ఆరోపించారు. ఏపీ ఎరుకల సేవా సంఘం, ఇతర గిరిజన సంఘాల సహకారంతో ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఇతని పైన ప్యాపిలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఆయన వెనక ముఖ్య కారకుడు పెనుబడి ఎరుకల మధు కుమార్ ఉన్నారని, ఆయనపై చీటింగ్ కేసు నమోదు చేసి, తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. అనంతరం సిఐ వెంకట్రామిరెడ్డికి ఈ సమస్యపై వినాయక పత్రాన్ని అందజేశారు. అనంతరం తహశీల్దార్ భారతికి సైతం వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్టీ నాయకులు సూర్యుడు, రమేష్, వరప్రసాద్, నాగరాజు, పెదరాయుడు, రాజశేఖర్, శ్రీనివాసులు, చలపతి, బాల కృష్ణ, హేమలత, రాధిక, ఎరుకల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంటిని నిర్మించుకుంటే అదనపు నిధులు

విశాలాంధ్ర - వెలుగోడు: మండలంలో గృహాలు నిర్మించుకుంటూ ఆర్థికంగా వెనకబడ్డ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు నిధులను ఇస్తుందని ఎంపిడిఓ మధుసూదన రెడ్డి అన్నారు. గృహ నిర్మాణశాఖ అధికారులు గతంలో ఇచ్చిన బిల్లులకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచులకు లక్ష రూపాయలు ప్రభుత్వం వారు అదనంగా ఇస్తున్నటుగా నంద్యాల జిల్లా గృహనిర్మాణ శాఖ ఈఈ వెంకటేశ్వర్లు బుధవారం హౌసింగ్ లేఅవుట్ నందు లబ్ధిదారుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మధు సుధన్ రెడ్డి, మండల తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఎంజి ఎన్ఆర్ ఇజిఎస్ ఎపిఓ మల్లికార్జున, సిబంది, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారుల గృహాలను క్షేత్ర పరిశీలన చేసి వారికి అవగాహన కల్పించి గృహాలు త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారులు, సిబ్బంది సూచించారు.

సెక్షన్ 22 ఏ1 భూముల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూముల పరిష్కారంపై స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తో కలిసి సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూములు నిషేధిత జాబితాలో నుండి తొలగింపుపై జిల్లాస్థాయి స్క్రుటీనీ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా ఆర్డీఓ విశ్వనాథ్, డోన్ ఆర్డిఓ నరసింహులు సంబంధిత మండల తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూముల పరిష్కారం పై వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూములను నిషేధిత జాబితాలో తొలగించేందుకు 24 దరఖాస్తులను స్వీకరించారని, ఇందుకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వాళ్లందరికీ న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న చుక్కల భూములు, సెక్షన్ 22 ఏ1 భూములను పరిశీలించి అర్హతను బట్టి నిషేధిత జాబితాలో నుండి డీనోటిఫై చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలు మండల తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

నంద్యాలలోనే హైదరాబాద్ తరహా వైద్య సేవలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఈ నెల 14న నంద్యాల పట్టణంలోని పద్మావతీ నగర్‌లో నూతనంగా నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభిస్తు న్నట్లు ఆసుపత్రి అధినేతలు డా.వినోద్ కుమార్, డా.అరుణ కుమారిలు తెలిపారు. బుధవారం పద్మావతి నగర్‌లోని నూతన భవనం నెరవాటి హాస్పిటల్ నందు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక నుండి నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు హైదరాబాద్ తరహా వైద్య సేవలు నంద్యా లలో అందుబాటులోకి రానున్నట్లు అన్నారు. సుదూర ప్రాం తాలకు వెళ్లకుండా ఇక్కడనే అత్యాధునిక వైద్య సేవలు నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు కల్పిస్తున్నా మన్నారు. 2004లో గాంధీచౌక్‌లో నెరవాటి ఆసుపత్రిని ప్రారంభించామని, ప్రతి పది సంవత్సరాలకు ఒక సారి నూతన ఒరవడితో ప్రజ లకు మంచి వైద్య సేవలు అందిస్తున్నా మనడంలో అతిశయోక్తి లేదన్నారు. పదేళ్లలో నెరవాటి ఆసుపత్రి అంచెలంచలుగా ఎదిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే 2014 సంవత్సరంలో టెస్ట్ ట్యూబ్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం నెరవాటి మల్టీ స్పెషల్టి ఆస్పత్రిని ప్రారంభిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. నంద్యాల పట్టణంలో ఏర్పాటైన నెరవాటి మల్టీస్పెషల్టి ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉపయోగించుకోవాలని డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ అరుణ కుమారులు కోరారు. ఈ సమావేశంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త నేరవాటి సత్యనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూళ్లు

- ఆలస్యమైతే పిల్లలను కొట్టి ఫీజులు వసూలు
- పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- అర్హత లేని వారితో విద్యా బోధన
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం
- చేర్చుకునే ముందు ఓ మాట, చేరిన తర్వాత మాట మారుస్తున్నారంటున్న తల్లిదండ్రులు

విశాలాంధ్ర - రుద్రవరం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎంతో అవసరమైనవి విద్య, వైద్యం. ఇవి తెలుసుకున్న ధన బలం, రాజకీయం బలం కలిగిన కొందరు ప్రైవేటు యాజమాన్యం గ్రామాలలో ప్రైవేటు పాఠశాలలను ఏర్పాటు చేసి, మా పాఠశాలలో మీ పిల్లలను చేర్పిస్తే ఉన్నతమైన విద్యతో పాటు క్రమ శిక్షణ నేర్పిస్తామని, మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాదులు మా పాఠశాలలోనే వేస్తా మంటూ భరోసా నిస్తూ, వారి పిల్లలను పాఠశాలలో చేర్చుకుంటున్నారు. రోజులు గడచిన తరువాత ముందుగా చెప్పిన మాటలు మరచి ముక్కు పిండుతూ, ఇంకా అవసం మైతే పిల్లలపైన రెండు దెబ్బలు కొట్టి అధికారులు సూచించిన ప్రకారం కాకుండా అధిక ఫీజులను వసూలు చేస్తున్న వైనం మండల కేంద్రంలోని చైతన్య పాఠశాలలో చోటు చేసుకుంది. రుద్రవరంలోని చైతన్య పాఠశాలలో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు 200 మంది పైనే విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పే వారికి కనీస అర్హతలు లేనప్పటికీ వారిని పెట్టుకొని పిల్లలకు విద్య నేర్పిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ విద్యార్థులకు పాఠశాలలో అవసరమైన కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. పిల్లలకు మల, మూత్రాలకు వెళ్లాలంటే పాఠశాల బయటి ప్రాంతంలోని పొలాలలోకి వెళుతున్నారన్నారు. పాఠశాలలో విద్యార్థులకు కనీస అవసర మైన సౌకర్యాలను లేనప్ప టికీ విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బం దులు పడుతున్నప్పటికీ మీ ఇబ్బందులతో మాకేంటి పని అంటూ ఫీజులను మాత్రం అధికారులు సూచించిన దానికంటే రూ.5 వేలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాస్త ఆలస్య మైతే బడిలో చదువుకుంటున్న పిల్లలను కొట్టి మరీ వసూలు చేయడం దారుణని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. అదే గ్రామంలోని చైతన్య పాఠశాలలో నర్సరీ, యూకేజీ, ఎల్కేజీ చదువుకుంటున్న చిన్నారులు దాదాపు 130 మంది చదువుకుంటున్న చైతన్య పాఠ శాలకు కొన్ని అడుగుల దూరంలోనే వరి గింజలను ఆడించి బియ్యాం వచ్చే పెద్ద గిర్నీ ఉండడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు అవస్థలు పడుతున్నా రన్నారు. వడ్లను ఆడించే సమయంలో వచ్చే పెద్ద పెద్ద శబ్దాలతో చిన్నారులు హడలి పోవాల్సిన దుస్థితి వస్తుందన్నారు. వడ్లను ఆడించే సమయంలో వచ్చే పొట్టుతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. పాఠశాలలో చదివే చిన్నారులకు తాగేందుకు నీటిని ఒక ప్లాస్టిక్ డ్రమ్మును ఏర్పాటు చేశారు. ఆ ప్లాస్టిక్ డ్రమ్ములోని నీళ్లను చిన్నారులు త్రాగుతున్నారన్నారు. పాఠశాలలో చిన్నారులకు కనీస సౌకర్యాలు యాజ మాన్యం ఏర్పాటు చేయ లేదని తల్లిదండ్రులు ఆరో పిస్తున్నారు. నర్సరీ, ఎల్కే జీ, యూకేజీ చదివే చిన్నా రులకు అధికారులు సూచించిన ప్రకారం కాకుండా ఒక్కొక్కరి నుండి రూ.2 వేలు, రూ.3 వేలను వసూలు చేయడం జరుగుతుందన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవ డంతోనే పాఠశాల యాజమాన్యం ఇష్టానుసారంగా అధిక వసూళ్లకు పాల్పడడం జరుగుతుందని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకొని పాఠశాలలో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేసి, అర్హత కలిగిన వారిచే పిల్లలకు చదువు చెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధిక ఫీజులు వసూలు చేయలేదు : చైతన్య పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులను వసూలు చేయలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. ఫీజులు వసూలు చేయడంలో పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బంది విద్యార్థులను కొట్టి ఫీజులను తీసుకొని రమ్మని అన్నదానిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వ అధికారులు తరగతుల వారీగా ఫీజులను వసూలు చేయాలని మాకు ఎలాంటి సూచనలు ఇవ్వలేదన్నారు. మేము వసూలు చేసిన దానిని నివేదికలుగా చేసి సంబంధిత అధికారులకు సమర్పిస్తామన్నారు.

భూమా అంటేనే క్యాడర్‌కు ధీమా : ఎంపీటీసీ

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీ భూమా నాగిరెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి మాట్లాడుతూ భూమా నాగిరెడ్డి అంటేనే కార్యకర్తలకు క్యాడర్కు ఒక ధీమా లాంటిదని భూమ సేవలను కొనియాడారు. రెండు తెలుగు రాష్ట్రాలలో మంచి గుర్తింపు కలిగినటువంటి పొలిటికల్ లీడర్ స్వర్గీయ శ్రీ భూమా నాగిరెడ్డి గారి 8వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కమతం సుబ్బారెడ్డి శీలం లక్ష్మీ ప్రసాద్ శీలం రామ్మోహన్, రాము, హుస్సేన్ బాష, అలీ, ఐటిడిపి సిరాజ్ భూమా అభిమానులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలి మృతి

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో కూలి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. 108 ఈఎంటీ జనార్ధన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు బేతంచర్ల మండలం బలపాలపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ (36) జీవనోపాధి కోసం రెండేళ్ల అవుకు పట్టణంలో స్థిరపడ్డాడు. దినసరి కూలీకి వెళ్లే వేణుగోపాల్ చెన్నంపల్లి గ్రామంలోని పాత ఇంటిని కూల్చివేసే పనికి వెళ్లగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలగా 108కు సమాచారం ఇవ్వగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

టీబీ రహిత సమాజం నిర్మిద్దాం

విశాలాంధ్ర - పాములపాడు : టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని, అందుకు ప్రజలు సహకరించాలని టీబీ సూపర్వైజర్ చెరుకు రవి కుమార్ ప్రజలను కోరారు. మండలంలోని ఇస్కాల గ్రామం బస్ స్టాండ్ ఆవరణంలో ఆత్మకూరు టీబీ యూనిట్ సూపర్వైజర్ చెరుకు రవికుమార్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సిబ్బంది ఇచ్చే సూచనలు పాటించి, టీబీ రహిత పంచాయతీగా చేయాలని పిలుపునిచ్చారు. పోషకాహార లోపం ఉంటే వయస్సు, లింగ తారతమ్యం లేకుండా టిబి బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మౌలాలి, ఎంఎల్ హెచ్‌పీ సింధూర, కార్యకర్తలు, బోయ మల్లయ్య, అబ్రహం, భరత్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాక్సిన్ జీవితానికి సురక్ష

విశాలాంధ్ర - శిరివెళ్ల: పురిటి సమయం నుండి ఐదేళ్లలోపు చిన్నారులకు వేసే వ్యాక్సిన్ వారి జీవితానికి సురక్షితం లాంటిదని జిల్లా వ్యాక్సినేషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ సి.సురేంద్రబాబు అన్నారు. మండల కేంద్రంలోని రెండవ సచివాలయంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. యునిసెఫ్, భారత ప్రభుత్వం సరఫరా చేస్తున్న వ్యాక్సిన్‌లు చిన్నపిల్లలు, గర్భవతులు తప్పనిసరిగా తీసుకో వాలని సూచించారు. హడావిడిగా చిరాకుగా కాకుండా చిన్నారులకు, గర్భావతులకు వేసే వ్యాక్సిన్ 12 రకాల జబ్బులను ఎదుర్కొగల శక్తి సామర్థ్యాలు, ఇమ్యూనిటీ పవర్ లభిస్తుందని డాక్టర్ సురేంద్ర బాబు అన్నారు. వైద్యాధికారి ముఖేష్, కమ్యూనిటీ హెల్త్ అధికారి రామ్మోహన్ రెడ్డి హెచ్ఎస్ సరస్వతి ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో యువత పోరు విజయవంతం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో యువత పోరు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. బుధవారం జిల్లా కేంద్రంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన జిల్లా పరిధిలోని అన్ని నియోజక వర్గాల ఇంచార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రజలు యువత పోరు కార్యక్రమంలో పాల్గొని, అనంతరం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని లేదా ఉద్యోగాలను కల్పించాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు యువత పోరు కార్యక్రమం వివరాలను తెలిజేస్తూ, కూటమి ప్రభుత్వం తీరును తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మాజీ మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, డా.సుధీర్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు దాల్ మిల్ అమీర్ బాష, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నదని, అధికారం చేపట్టిన నాటి నుండి విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ బాకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మైనారిటీ జూనియర్ కళాశాల, హాస్టల్ నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఎన్ఎండీ ఫిరోజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమం కింద వైఎస్సార్ నగర్ సమీపంలో మైనారిటీ విద్యార్థుల కోసం నిర్మాణంలో ఉన్న జూనియర్ కళాశాల, హాస్టళ్ల పనులను టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైఎస్ఆర్పిపి ప్రభుత్వం నిధులు కేటాయించకుండా మైనారిటీలను మోసం చేయడంతో ఈ ప్రాజెక్ట్ నిలిచిపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర న్యాయ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తక్షణమే నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయన్నారు. అనంతరం నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించిన ఎన్ఎండి ఫిరోజ్ ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా పూర్తి చేయాలని మైనారిటీ అధికారులకు సూచించారు. అధునాతన సౌకర్యాలతో కళాశాల, హాస్టళ్లు త్వరలో విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయని ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేరెడ్డి శివ నాగిరెడ్డి, బుగ్గ రాముడు, మరాఠీ సూరి, కామిని మల్లికార్జున, ఉప్పరి సురేష్ కుమార్, బద్రి శెట్టి రవి, ఇసుక చాంద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత మంచి నీటిని అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర - కొత్తపల్లి: పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు సురక్షితమైన మంచినీరు అందించడమే కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ లక్ష్యమని ఆ సంస్థ జోనల్ మేనేజర్ దామోదర్ నాయుడు జోనల్ మార్కెటింగ్ మేనేజర్ కిషోర్ ఏరియా మేనేజర్ సుబ్బారెడ్డి జోనల్ హెచ్ ఆర్ మహేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ప్రముఖమైన కోరోమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా విద్యార్థులకు శుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. శుభ్రమైన త్రాగునీరు అందుబాటులో ఉంటే, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి తమ విద్యాభ్యాసంలో మరింత చురుగ్గా ఉంటారన్నారు. ఈ మంచి కార్యక్రమానికి సహకరించిన కోరోమండల్ సంస్థకు తమ కృతజ్ఞతలు,అని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి గ్రోమోర్ మేనేజర్ నాగ శేషులు గ్రామ సర్పంచ్ పాఠశాల చైర్మన్ పాఠశాల ఉపాధ్యాయ బృందము పాల్గొన్నారు.

ఈ పంట నమోదుపై అభ్యంతరాలు తెలపండి

విశాలాంధ్ర - వెలుగోడు: మండలంలోని బోయరేవుల, వెలుగోడు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమనికి ఆత్మకూరు ఏడి ఆంజనేయ, నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రబి 2024 పంట నమోదు వివరాలు ముసాయిదా జాబితా సామాజిక తనిఖీ కొరకు అన్ని రైతు సేవ కేంద్రాల్లో ప్రచురించారని, ఈ పంట నమోదుపై ఏమైనా అభ్యంతరాలు ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలను సరిచూసుకోవాలని ఏడి కోరారు. వెటర్నరీ డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది సుధారాణి, అంజిత్ కుమార్ రెడ్డి, అర్పత్ రైతులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 340సీపై అండర్ పాస్ బ్రిడ్జి వద్దు

విశాలాంధ్ర - పాములపాడు : మండలంలోని, ఎర్రగూడురు గ్రామంలో నేషనల్ హైవే 340సి కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం వద్దు అని ఎర్రగూడురు గ్రామానికి చెందిన నాగార్జున రెడ్డి, రాజన్న, శివశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సుమారు వందమంది ఆందోళనతో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామం మీదుగా పోయే ఎన్‌హెచ్ 340సి జాతీయ రహదారిపై పాత అలైన్‌మెంట్ లలోలేని అండర్ పాస్ బ్రిడ్జిని కొంతమంది వ్యక్తుల ఒత్తిడి మేరకు అలైన్ మెంట్ మార్చి నిర్మించవద్దన్నారు. నేషనల్ హైవే సేఫ్టీ కమిటీ సూచన ప్రకారం ఎర్రగూడూరు గ్రామంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే సర్కిల్ పాయింట్ నుంచి జీరో పాయింట్ పక్కనే ఉన్న ఎసార్ ఎంసీ తెలుగుగంగా కాలువ బ్రిడ్జి వరకు వస్తుందని, ఇలా జరుగుతే భారీగా ప్రమాదాలు జరిగి వాహ నాలు తెలుగంగలో పడే అవకాశం ఉందని నేషనల్ హైవే సేఫ్టీ అథారిటీ సూచించిందన్నారు. కమాలాకర్, రమేష్ నాయక్, లింగేశ్వర గౌడు, శివ నాయక్, విశ్వనాథ్, శ్రీనివాసులు, జగదీష్,సాయి కృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

చదువుతోపాటు చట్టాలను తెలుసుకోవాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు చట్టా లను తెలుసుకోవాలని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. మండలంలోని పేరాయి పల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు లైంగిక పరమైన నేరాలను గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ మధ్యకాలంలో ఎక్కువగా బాలలపై లైంగిక పరమైన దాడులు జరుగు తున్నాయన్నారు. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు, కుటుంబంలోని వారైనా, అసభ్యకరమైన చేష్టలు చేసినప్పుడు వెంటనే తల్లిదండ్రులకు లేదా దగ్గర్లో ఉన్న పోలీసు అధికారులకు చెప్పాలన్నారు. న్యాయవాది గణేష్, ప్రధానోపాధ్యాయులు మహబూబ్ బాష పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - చాగలమర్రి: పంటల సాగులో అధిక దిగుబడులు పొందాలంటే నాణ్యమైన విత్తనాలతోపాటు మేలైన యాజమాన్య పద్ధతులు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ తెలిపారు. బుధవారం మండలంలోని కొలుములపేట గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సజ్జ మరియు వేరుశనగ పంటలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. అధిక నత్రజని ఎరువుల వాడకం వలన పురుగు మరియు తెగుళ్ళ బెడద ఎక్కువగా ఉంటుందని సమతుల్య ఎరువుల యాజమాన్యం చేపట్టి నేల ఆరోగ్యం మరియు పంటలను కాపాడాలని తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, గురువారం 13, మార్చి 2025

మెడికవర్ హాస్పిటల్ అనుమతులు రద్దుచేయాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: మెడికవర్ హాస్పిటల్ అనుమతులు రద్దుచేయాలని, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో డిఎంఅండ్ హెచ్ఓ కార్యాలయం ఎదుట సీపీఐ నగర సహాయకార్యదర్శి సీ మహేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప, నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ కర్నూలు నగరంలోని కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటల్స్ దోపిడీని అరికట్టాలన్నారు. మెడికవర్ హాస్పిటల్లో వరుసగా ఆరోగులు మృత్యువాతన పడుతున్నారని, వాటిపై సమగ్రమైన విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. మృతుల ఒక్కొక్క కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్ గ్రేసియా చెల్లించాలన్నారు. మెడికవర్ హాస్పిటల్ యాజమాన్య పైన ఇంచార్జ్ మహేశ్వర్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ హాస్పిటల్లో ఆరోగ్యశ్రీ నిధులపైన విచారణ చేయించాలని కోరారు.నగరంలో కార్పొరేట్, ప్రైవేట్ వైద్యశాలలలో ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కార్పొరేట్, ప్రైవేట్ వైద్యశాలలో అనేక మంది రోగులు వైద్యం వికటించి మృత్యువాతన పడుతున్నారని ఆరోపించారు. యాజమాన్యం మృతుల కుటుంబాలకు డబ్బులు ఇచ్చిన కేసులు లేకుండా చూసుకుంటున్నారని ఆరోపించారు. డిఎంఅండ్ హెచ్ఓ అరుణ ధర్నా దగ్గరికి వచ్చి సీపీఐ నాయకులతో మాట్లాడి తక్షణమే మెడికవర్ హాస్పిటల్ లో జరుగుతున్న అంశాల పైన విచారణ చేపిస్తామని హామీ ఇచ్చి వినతి పత్రాన్ని స్వీకరించడం జరిగినది. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు బిసన్న, ఈశ్వర్, నల్లన్న, ఏఐటీయూసీ నాయకులు రామాంజి, దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి కుమార్ రాజా, ప్రసాదు, యువజన సమాఖ్య నగర అధ్యక్షులు నాగరాజు, శీను, మహిళా సంఘం నాయకులు సులోచనమ్మ, వెంకటేశ్వర్లు, రాముడు, మల్లికార్జున పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్దిదారులకు అదనపు ఆర్థిక సహాయం : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : బీసీ, ఎస్సీ, ఎస్టీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ లబ్ధిదారులకు అందచేయనున్న అదనపు ఆర్థిక సహాయం అంశంపై కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి డిసెంబర్ 10, 2024 తర్వాత నిర్మాణంలో పురోగతి లో ఉన్న ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ విడుదల చేసిందన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, పివిటీజీలకు రూ.1.00 లక్ష అదనపు ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో హౌసింగ్ కింద 39 వేల వరకు ఇళ్లను మంజూరు కాగా, ఇందులో 22 వేల 590 ఇళ్లను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంకా 16 వేల 91 ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హౌసింగ్ పథకం కింద 9 వేల 446 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు ఉన్నారని, ఇందులో 4 వేల 28 మంది ఎస్సీలు, 5 వేల 170 మంది బీసీలు, 248 మంది ఎస్టీలు ఉన్నారన్నారు. అధనంగా పెరుగుదల వలన జిల్లాలో అదనంగా 47.85 కోట్ల రూపాయలు ఖర్చవుతుందన్నారు. మరో 2 రోజుల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ ఇన్చార్జి లు లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న అదనపు ఆర్థిక సాయం గురించి వివరిస్తారన్నారు. జిల్లాలో బేస్మెంట్ లెవెల్‌లో 7 వేల 900 మంది ఇళ్ళు ఉన్నాయని, ఎల్ఎల్‌లో 1000 ఇళ్ళు, రూఫ్ లెవెల్ లో 1500 ఇళ్ళు, రూఫ్ కాస్ట్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయని, వివిధ కారణాల వల్ల ఇళ్ళ నిర్మాణాలు ఆగి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అందించే అదనపు ఆర్థిక సాయాన్ని వినియోగించుకుని ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసుకోవాలని కలెక్టర్ గృహ లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఇప్పటివరకు 39 వేల వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇళ్ళ స్థలం, ఇల్లు మంజూరు కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. టిడ్కో గృహాలు జిల్లాలో 10వేలు ఉన్నాయని వీటికి విద్యుత్, నీటి వసతులు లేవని వాటి ఏర్పాటు కోసం బడ్జెట్‌కోసం ప్రతిపాధనలు ప్రభుత్వానికి పంపించడం జరిగిందని బడ్జెట్ వచ్చిన వెంటనే పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందచేస్తామన్నారు. ఈ పాత్రికేయుల సమావేశంలో హౌసింగ్ పీడీ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా జ్యూస్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు భూమి పూజ

విశాలాంధ్ర-పత్తికొండ: ఈనెల 14న టమోటా జ్యూస్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు పత్తికొండ మండలం కనకదిన్నె సమీపంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు భూమి పూజ చేస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కడవల సుధాకర్ తెలిపారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడ్డ పత్తికొండ నియోజకవర్గంలో రైతులు టమోటా పంటను ఎక్కువగా సాగు చేస్తారన్నారు. టమోటా పంటకు గిట్టుబాటు ధర లభించినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోవడం జరుగు తుందన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాంత రైతుల కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం టమోటా జ్యూస్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రూ.11 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ముని నాయుడు, తిమ్మరాజు, మధ్యాహ్నమయ్య పాల్గొన్నారు.

పదిలో మంచి ఉత్తీర్ణత సాధించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత ఫలితాలను సాధించాలని సర్పంచ్ మంజుల, అర్బన్ సీఐ జయన్న, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు పెద్దయ్యలు సూచించారు. బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని పందికోన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు అంటే భయాందోళనకు గురికాకుండా ప్రణాళిక బద్ధంగా చదివి పరీక్షలలో మంచి ఉత్తీర్ణత ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రెహమాన్, విద్యా కమిటీ చైర్మన్‌లు రంగస్వామి, రాజశేఖర్, గ్రామ పెద్దలు మాలాద్రి, కడవల సుధాకర్, చెన్నమ నాయుడు, హరికృష్ణ పాల్గొన్నారు.

యువతను మోసం చేసి పోరు డ్రామానా..

విశాలాంధ్ర – గోనెగండ్ల: గత వైసిపి ప్రభుత్వం యువతను జాబ్ క్యాలెండర్ల రూపంలో మోసం చేసి గద్దె దిగి, నేడు యువత పోరు అని కార్యక్రమం చేపట్టడం వైసీపీ పార్టీకే చెందిందని టిడిపి నాయకులు రంగస్వామి నాయుడు సందీప్ నాయుడు, ఐరన్ ఐరన్ బండ బాష, నాగరాజు, రమేష్ నాయుడు, జయపాల్, రాంపురం రఫిక్ ఆరోపించారు. ఈ సందర్భంగా వారు దుతూ వైసీపీ యువత పోరు జగన్ రెడ్డి ఇంటి ముందు పోరు ధర్నా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్దయ్య, ప్రభాకర్ నాయుడు, వినోద్ కుమార్ గౌడ్ మునిస్వామి, అంపన్న, దేవేంద్ర, నీలకంఠ, చంద్రన్న, దత్తాత్రేయ, ప్రభుదాసు, రాజేష్, శివ నరేష్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఉమ్మడి జిల్లా డీఎఫ్‌పీఎస్ చైర్మన్

విశాలాంధ్ర – కర్నూలు సీటీ : రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లా డిఎఫ్.సిఎస్ చైర్మన్ బీఎస్ నవీన్ కుమార్ విజయవాడలోని మంత్రి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రికి వివరించారు. ముఖ్యంగా, శ్రీశైలం రిజర్వాయర్‌లో సీడ్ స్టాకింగ్ కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు 2 కోట్ల చేప పిల్లలను విడుదల చేసే అవకాశమున్నదని, దీనికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఈ చర్య మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేలా ఉంటుందని, వారి ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుందని బీఎస్ నవీన్ కుమార్‌గా తెలిపారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 401 గైర్హాజరు

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ సెకండియర్ పరీక్షకు 20,925 గాను 20,499 పరీక్షకు హాజరై, 401 విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ గురువయ్య శెట్టి బుధవారం తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కింద ఇద్దరిని బుక్ చేసినట్లు ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

విశాలాంధ్ర-గూడూరు: ప్లాస్టిక్ కవరర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ కే రాఘవేంద్ర దుకాణ యజమానులను హెచ్చరించారు. బుధవారం నగర పంచాయతీలోని హోటళ్లు, షాపింగ్ మాల్స్, బేకరీలు, పలు దుకాణాలను మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ అధికారులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి హానికరమని, ప్లాస్టిక్ వాడడం తగ్గిస్తే కాలుష్యం నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగంలో దుకాణ యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు.

ఛలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -గోనెగండ్ల: జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీ కార్యకర్తలు లక్షలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని జనసేన పార్టీ కర్నూలు జిల్లా పార్లమెంట్ ఆవిర్భావ సభ సమన్వయకర్త చింతా సురేష్ బాబు, ఎమ్మిగనూరు నియోజక వర్గ ఇంచార్జీ రేఖగౌడ్ పిలుపునిచ్చారు, జిల్లా నాయకుల గోనెగండ్ల మండల నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజక వర్గ మీడియా ఇంచార్జీ గానిగ బాష, ఖాసిం సాహెబ్, మునిస్వామి, దూద్ పీరా, పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర – కోడుమూరు : వైసీపీ కన్వీనర్ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ అభిమానులు,వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని స్థానిక హేమాద్రి రెడ్డి కాంప్లెక్స్ నందు ఆ వైసిపి నాయకులు,కార్యకర్తలతో కలిసి మండల కన్వీనర్ రమేష్ నాయుడు వైస్సార్సీపీ జెండాను ఆవిష్కరించారు. మాజీ ముఖ్యమంత్రి,దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి,మాజీ ఎంపీటీసీ లింగన్న, రవికుమార్ రెడ్డి, లింగమూర్తి, సుబ్బారావుస్వామి, ధరణిరెడ్డి, పాలాక్షిరెడ్డి, జగదీష్, గోపి, రవిశంకర్, వీరన్న, వెంకట్రావు, నారాయణ, రవి, సురేష్, శ్యామ్, డీజే రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

విశాలాంధ్ర – కోడుమూరు: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం నిషేధమని, ఈ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమం అధికారి డాక్టర్ రఘు కోరారు. బుధవారం కోడుమూరు కో-లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వర్కూరు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధూమపాన రహిత దినోత్సవం సందర్భంగా ప్రజలకు ధూమపానం చేయడం వలన కలిగే అనర్థాల గురించి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మార్చి నెల రెండవ బుధవారం జాతీయ ధూమపాన నిషేధ దినం నిర్వహిస్తామన్నారు. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలు పోస్టర్లు, గోడపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమములో కో-లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్, ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప, హెల్త్ సూపర్వైజర్ కమాల్ సాహెబ్, సామాజిక ఆరోగ్య అధికారి ధరణి,ఆరోగ్య కార్యకర్త రమాదేవి, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ డాక్టర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్న నకిలీ విలేకరి

విశాలాంధ్ర – పెద్దకడబూరు : మండలంలోని ఆర్ఎంపీ డాక్టర్లను ఓ నకిలీ విలేకరి బ్లాక్ మెయిల్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్, మండల కార్యదర్శి వీరేష్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రమైన పెద్ద కడబూరులోని స్థానిక సిపిఐ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాటాడుతూ గ్రామాల్లో ప్రజలకు అత్యవసర ప్రథమ చికిత్స చేయాలంటే ఆర్ఎంపీ డాక్టర్లే దిక్కన్నారు. గతంలో ప్రభుత్వం ఆర్ఎంపీ డాక్టర్లను గుర్తింపు ఇస్తామని మోసం చేసిందన్నారు. అలాంటి ఆర్ఎంపీ వైద్యులను విలేకరి అని చెప్పి రకరకాలలుగా వేదించి, ఒత్తిడికి గురి చేస్తున్నారని విమర్శించారు. మండలంలో కొంత మంది నకిలీ విలేకరులు ఆర్ఎంపీ వైద్యుల వద్ద డబ్బులు ఇస్తావా, వార్తలు రాయాలా అని బ్లాక్ మెయిల్ చేస్తున్నార న్నారు. ప్రభుత్వ డాక్టర్లు విధుల్లో ఏదో ఒక రూపంగా తప్పులు చేస్తున్నారని, ఆర్ఎంపీ డాక్టర్లను ప్రథమ చికిత్స చేయరాదని చెప్పడం సరికాదన్నారు. పెద్ద కడబూరులో సతీష్ మెడికల్ షాపు యజ మానులు మల్లికార్జున, నరసన్నలు షాపులు నడుపుతున్నారని, వీరు ఏ ఫార్మసి చేశారని ఆయన ప్రశ్నించారు. డ్రగ్ ఇన్స్పెక్టర్లు షాపు తనిఖీకి వచ్చినప్పుడు ఎందుకు షాపులను తాళాలు వేసుకో పోతున్నారన్నారు. కొందరు నకిలీ విలేకరులు ఇసుక ట్రాక్టర్లలను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలను, ఆర్ఎంపీలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని గుర్తించి ప్రభుత్వం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి జాఫర్ పటేల్, నాయకులు తిక్కన్న, గోపాల్, రెక్కల గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయచూరు నుండి కాకినాడకు రైలు పున ప్రారంభించాలి

విశాలాంధ్ర – ఆదోని క్రైం: రాయచూరు నుండి కాకినాడ వరకు నడుస్తున్న రైలు ను అర్ధాంతరంగా నిలిపివేశారని, విజయవాడ అటువైపు వెళ్లే ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, రైచూర్ నుండి కాకినాడకు రైలును ప్రారంభించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెలగావి నుండి మణుగూరుకు వెళ్లడానికి నడుస్తున్న డైలీ ట్రైను రద్దు చేయడం వల్ల ఆదోని ప్రాంతం నుండి హైదరాబాద్ వెళ్ళవలసిన విద్యార్థులు, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేషెంట్స్ వ్యాపార నిమిత్తం వెళ్లేవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విచ్చలవిడిగా ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికులను దోచుకుంటున్నా రన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రాయచూరు నుండి సికింద్రాబాద్, కాచిగూడకు నడుస్తున్న ప్యాసింజర్ రైలు గుంతకల్లు వయా ఆదోని మీదుగా నడిపించాలని కోరారు. రాయచూరు నుండి గుంతకల్లు డోన్ వరకు నడుస్తున్న ప్యాసింజర్ రైలు నంద్యాల వరకు కొనసాగించాలని రైల్వే స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లును కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న, అధ్యక్షులు వైటి భీమేష్, జిల్లా సమితి సభ్యులు ఉసేని, షేక్షావలి, కొత్తూరు గంగన్న, చిట్టిబాబు, గిరిమల్లప్ప, అంజి, రాము తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ రంజాన్ మిశ్రా ఏక సభ్య కమిషన్ రద్దు చేయాలి

విశాలాంధ్ర – ఆదోని రూరల్: మాలల కులస్తులకు అన్యాయం చేసే రాజీవ్ రంజాన్ మిశ్రాయేక సభ్య కమిషన్ వర్గీకరణ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరాం డిమాండ్ చేశారు. బుధవారం న్యాయవాది చంద్రయ్య కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 20శాతం మెజార్టీ జనాభా కలిగిన మాలలకు కేవలం 7.5 శాతం రిజర్వేషన్ కేటాయించడము ఏంటని నిలదీశారు. కేవలం నాలుగు శాతం లేని మాదిగలకు నివేదికలో 6.5శాతం రిజర్వేషన్ అవకాశాలు కల్పిస్తూ పెద్ద పీటవేశారని ఆరోపించారు. మూడు శాతం ఉన్న రెల్లి సామాజిక వర్గమునకు ఒక శాతం మాత్రమే నివేదికలో కేటాయించి అన్యాయం చేశారని గుర్తు చేశారు. రిజర్వేషన్ల వర్గీకరణ వల్ల మొత్తం దళిత కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. కుల వర్గీకరణకు వ్యతిరేకంగా పివి రావు ఎంతోమంది గత 30 ఏళ్లుగా మాల మహానాడు ఆధ్వర్యంలో పోరాటాలు చేసిన విషయాన్ని గమనించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే రాష్ట్రంలో ఎన్డీఏ పార్టీలను ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో తరిమికొడతామని హెచ్చరించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు బసాపురం ఎల్లప్ప,నీలకంఠ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



విశాలాంధ్ర – పెద్దకడబూరు : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. బుధవారం మండలంలో అనారోగ్యంతో, అప్పులపాలైన వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సహాయ నిధి కింద మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న సహకారంతో 11 మందికి రూ.6.95 లక్షలు విలువచేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టౌన్ అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి మీ సేవ ఆంజనేయ, నాయకులు బొగ్గుల నరసన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రం హోం సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వర్క్ ఫ్రం హోం, ఎమ్ఎస్ఎమ్ఈ సర్వే లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపీడీవోలను ఆదేశించారు. బుధవారం ఉదయం వర్క్ ఫ్రమ్ హోం సర్వే, పి 4 సర్వే, ఎమ్ఎస్ఎమ్ఈ సర్వే తదితర అంశాలపై మండల స్పెషల్ అధికారులతో, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్‌లతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పలు కార్యక్రమాలకు సంబంధించి సర్వేలు నిర్వహించడం జరుగుతోందని నిర్దేశించిన గడువులోపు వాటిని పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్లు ఆయా డివిజన్లకు సంబంధించి ఎంపీడీవోలు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో సమీక్షలు నిర్వహించి, వేగవంతంగా పూర్తి అయ్యేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వర్క్ ఫ్రమ్ హోంకి సంబంధించిన సర్వే లో జిల్లా వెనుకబడి ఉందని, సర్వేను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

గోకులపాడులో ఘనంగా పెద్ద దేవర మహోత్సవం

విశాలాంధ్ర – క్రిష్ణగిరి: మండల పరిధిలోని తాళ్ల గోకులపాడు గ్రామంలో ఘనంగా పెద్ద దేవర మహోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో తెల్లవారుజామున పోతులను పురవీధుల గుండా ఊరేగించి పెద్దమ్మ, కర్రెమ్మ, చిన్నమ్మ తల్లి దేవాలయాల ముందు అమ్మవార్లకు బలి అర్పించారు. అనంతరం ప్రతి ఇంటి నుండి భక్తులు బోనలకుండలతో ఊరేగింపుగా వెళ్లి పొట్టేలను బలి అర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో దేవర సందర్భంగా ప్రజలు, భక్తులు బంధుమిత్రులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సందడితో దేవరలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తెలుసుకున్నారు. గ్రామమంతా ప్రజలతో భక్తులతో కిక్కిరిసిపోయింది. వీధుల వెంట అంగళ్లు లైటింగ్ తో గ్రామమంతా కాంతివంతంగా వెలిగిపోయింది. గ్రామంలో అమ్మవార్లకు చల్లదనం చేస్తే ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉంటారని పాడిపంటలు సమృద్ధిగా వస్తాయని నమ్మకంతో పెద్ద దేవర మహోత్సవాన్న నిర్వహించామని గ్రామ పెద్దలు తెలిపారు. పెద్ద దేవర సందర్భంగా క్రిష్ణగిరి ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో ఎలాంటి సంఘ టనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆదర్శ పాఠశాలలో పరిశుభ్రత పనులు

విశాలాంధ్ర – పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్ద కడబూరులోని ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ పాఠశాల ఆవరణంలో బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ రంగన్న జేసిబితో పరిసరాలను పరిశుభ్రంగా చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల ఆవరణంలో ముల్లకంపలను తొలగించి, ఇంకుడు గుంతలు తీయించినట్లు తెలిపారు. క్రీడా మైదానంలో వివిధ రకాల ఆటలకు సంబంధించిన కోర్టులను వేయించినట్లు తెలిపారు. పాఠశాలలో ఉన్నతమైన చదువుతో పాటు క్రీడల్లోను విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల కేంద్రంలో వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా, మండల, వైసీపీ నాయకులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు టి.మురళి నాయుడు, యవనాయకులు ఇమ్రాన్, మాజీ మండల కన్వీనర్ గోవింద్, కటికే మాబువలి, బగిలి ఉస్మాన్ సాహెబ్, ఎంపీటీసీ పద్మనాభం, నదిముల్లా, రఫీ, చికేన్ రాజ, సత్తార్, ముల్లాహుసేన్ వల్లి, ముల్లా నబీరసుల్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు టీడీపీ కుట్ర

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: పేద విద్యార్థులను చదు వుకు దూరం చేసేందుకు టీడీపీ కుట్ర చేస్తుందని వైసీపీ నేతలు విమ ర్శించారు. బుధ వారం యువతపోరు పేరుతో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ముందు దర్నా చౌక్ నుండి కలెక్టరేట్ వరకు బారీ ప్రదర్శన నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే విరూపాక్షి, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎంపీ బుట్టారేణుక, మాజీ ఎమ్మెల్యేలు వై.ప్రసాద్‌రెడ్డి, శ్రీదేవి, నాయకులు రుద్రాగౌడ్, సురేంద్రరెడ్డి, అహ్మద్ అలీఖాన్ వైసీపీ నాయకులు పాల్గొన్నారు. కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న ఆందోళన నుద్దేశించి బాలనాగిరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ ప్రకటించి అధికారంలోకి వచ్చిన తరువాత పించన్లు, ఉచిత గ్యాస్ పథకం తప్ప ఏమి అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, సంవత్సరానికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన ఏమి చేయలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌక ర్యం ఎప్పుడు చేస్తారన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

అహ్లాదకరంగా ఎంపీడీవో కార్యాలయం

విశాలాంధ్ర – గూడూరు: మండల పరిషత్ కార్యాలయం ఆవ రణం ఆహ్లాద కరంగా సుందరీకరణతో రూపు దాల్చుకుంది. దుర్గంధ వాతావరణంతో అపరిశుభ్రంగా ఉండటంతో అవసరమైన వసతులు లేక కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఓ శివనాప్రసాద్ ఆవరణం పరిసరాల దుస్థితిని గుర్తించి ఎన్నో ఏళ్లుగా అపరిశుభ్రంగా ఉన్న కార్యాలయం ఆవరణాన్ని మండల పరిషత్ నిధులతో సుందరీకరణ పనులు చేపట్టారు. జెసిబి సహాయంతో ఆవరణ స్థలాన్ని చదును చేసి ఆపై మట్టి వేసి అభివృద్ధి చేయించారు. ఆవరణ పరిసరాలు అహ్లాదకరంగా సుందరికరణ చేయడంతో మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సేవలు అభినందనీయం

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వినియోగదారులకు అందిస్తున్న సేవలు అభినందించ దగ్గవని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. బుధవారం కొత్త బస్టాండ్ దగ్గర హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు స్థాపించిన అనతి కాలంలోనే బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రజల మన్ననలు పొందిందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, శాఖలను విస్తరించడం అభినందనీయమన్నారు. మన ప్రాంతంలో డిపాజిట్లు తక్కువగా, చెల్లింపులు ఎక్కువగా ఉంటాయని, అయినప్పటికీ దేశంలో వివిధ ప్రాంతంలో సేకరించిన డిపాజిట్లు ఇక్కడ వ్యాపారం చేసేవారికి బ్యాంకు ద్వారా చేయూతనిస్తున్న యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే 50 లక్షలపైగా ఖాతాదారులు ఉన్నటువంటి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని టీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిబ్బంది విజయమోహన్ రెడ్డి, శశాంక్ సుందరం, వేణుగోపాల్ రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

పని చేసే వారికే పదవులివ్వాలి

విశాలాంధ్ర - కొత్తపల్లి: పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసే వారికే పదవులివ్వాలని మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డిలు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ నీటి సంఘం చైర్మన్ చిన్న పుల్లారెడ్డి, టీడీపీ మండల నాయకులు నాగశేషన్న యాదవ్ లతో కలిసి వారు మాట్లాడారు. టీడీపీ ప్రారంభం నుంచి పని చేసిన తమకు కాకుండా ఎమ్మెల్యే వర్గీయులు ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీడీపీ కార్యకర్తలకు తప్ప వైసీపీ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని, అయినా అవేవీ పట్టించుకోకుండా తమ స్వార్థం కోసం ఇతరులకు పదవులు కట్టబెట్టడం సరికాదన్నారు. దీనివల్ల పార్టీ కోసం పనిచేసే అసలైన టీడీపీ కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని, లేకుంటే జిల్లా ఇంచార్జి మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు. ఇప్పటికైనా అధిష్టానం గుర్తించి అసలైన టీడీపీ కార్యకర్తలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అహోబిలంలో భద్రత చర్యలను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల భద్రత ఏర్పాట్లను బుధవారం నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ కుమార్ తో కలిసి పరిశీలించారు. అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 4వ తేదీ నుండి ప్రారంభమై ఈనెల 15వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగునున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా జరగబోయే లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఎక్కువమంది ప్రజలు తరలివచ్చి కళ్యాణోత్సవాన్ని తిలకిస్తారని అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలను అడిషనల్ ఎస్పీ పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవానికి ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు రానున్న సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మోటార్ బైకులు, ఆటోలు, కార్లు మొదలగు వాహనాల కొరకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దిగువ, ఎగువ అహోబిలం టెంపుల్ క్యూలైన్లు, దిగువ అహోబిలంలో కళ్యాణోత్సవం జరుగు ప్రదేశంలోని విఐపి గ్యాలరీలు, జనరల్ గ్యాలరీలు, ఎంట్రీ, ఎగ్జిట్‌లను, వాహనాల పార్కింగ్ మొదలగు ప్రదేశాలను అడిషనల్ ఎస్పీ స్వయంగా పర్యటించి భద్రతా చర్యలను పరిశీలించారు. లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవానికి ఎలాంటి అంతరాయం లేకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మీకు అప్పగించిన ప్రదేశాలలో విధులు నిర్వహిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను, సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతో పాటు ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి గృహాలకు అదనపు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చాగలమర్రి : అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం చాగలమర్రి పట్టణంలోని కస్తూరిభా లేఅవుట్లలోని గృహనిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, బీసీ, ఎస్టీ, పీవీటీజీ (చెంచు)లకు గృహాలు మంజూరై నిర్మాణాలు వివిధ దశల్లో ఉంటే వాటిని పూర్తి చేయడానికి అదనపు ఆర్థిక సహాయం అందించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేల చొప్పున, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీ (చెంచు)లకు రూ.లక్ష చొప్పున అదనపు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తి గృహ నిర్మాణాలకు సంబంధించిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నరసింహారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఇంటిని నిర్మించుకునేందుకు అదనపు నిధులు

విశాలాంధ్ర - వెలుగోడు: మండలంలో గృహాలు నిర్మించు కుంటూ ఆర్థికంగా వెనక పడ్డ లబ్ధి దారులకు ప్రభుత్వం అదనపు నిధులను ఇస్తుందని ఎంపిడిఓ మధుసూదన రెడ్డి అన్నారు. గృహ నిర్మాణశాఖ అధికారులు గతంలో ఇచ్చిన బిల్లులకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచులకు లక్ష రూపాయలు ప్రభుత్వం వారు అదనంగా ఇస్తున్నటుగా నంద్యాల జిల్లా గృహనిర్మాణ శాఖ ఈఈ వెంకటేశ్వర్లు బుధవారం హౌసింగ్ లేఅవుట్ నందు లబ్ధిదారుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మధు సుధన్ రెడ్డి, మండల తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఎంజి ఎన్ఆర్ ఇజిఎస్ ఎపిఓ మల్లికార్జున, సిబంది, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారుల గృహాలను క్షేత్ర పరిశీలన చేసి వారికి అవగాహన కల్పించి గృహాలు త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారులు, సిబ్బంది సూచించారు.

రుద్రవరం గ్రామంలో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర - పాములపాడు : రుద్రవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది రైతుల అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఫణీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఫణీశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు తక్కువ పెట్టుబడితోని గ్రామంలోని ప్రకృతి వనరులపై వినియోగించుకొని నాణ్యమైన పంట ఉత్పత్తులను తీసుకోవాలని రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం అయినదని, వ్యవసాయ యాంత్రీకరణ కింద ట్రాక్టర్ సామాన్ కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి రెండు సీజన్లకు ఒకసారి జింక్ సల్ఫేట్ వాడుకోవాలని తెలిపారు. పచ్చి రొట్ట ఎరువులను పంటకు ముందు సాగు చేసి భూమిని సారవంతం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మద్దిలేటి, గ్రామ సచివాలయం అగ్రికల్చర్ సిబ్బంది గాయత్రి, చాంద్ బాషా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అదనంగా రూ.50 వేలు పెంపు

విశాలాంధ్ర - రుద్రవరం: పక్కా గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలను పెంచినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో మాట్లాడుతూ గృహ నిర్మాణంచేపట్టే లబ్ధిదారులకు గతంలో రూ.1.80 లక్షలకు ఇచ్చేవారు. దీంతో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడేవారు. మెటీరియల్ ఖర్చులు పెరగడంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టలేక ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం లబ్ధిదారుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఎస్సీ, బీసీ, ఎస్టి నిర్మాణదారులకు అదనంగా రుణం పెంచడం జరిగిందన్నారు. ఎస్సీలకు రూ.50 వేలు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఎస్టి లబ్ధిదారులకు రూ.1 లక్ష పెంచడం జరిగిందన్నారు. పెంచిన మొత్తాన్ని నాలుగు విడుదలగా బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కావున హౌసింగ్ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను చేపట్టాలని ఎంపీడీవో తెలిపారు.

వైభవంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి రథోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : మండల పరిధిలోని కొణిదెల గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి రథోత్సవ వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ రథోత్సవ వేడుకలకు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి హాజరు కావడం జరిగింది. ముందుగా వీరికి గ్రామ సర్పంచ్ కొంగర నవీన్, ఆలయ ధర్మకర్త కిరణ్ కుమార్, రైతు కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. వీరికి ఆలయ ఈవో కార్తీక్, దేవాలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను మేళతాళాల మధ్య పల్లకిలో తీసుకొని వచ్చి రథంలో ఉంచి వేదమంత్రాల మధ్య ఓం నమశ్శివాయ అంటూ వేలాదిమంది భక్తుల మధ్య రథోత్సవాన్ని లాగడం జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తిరుణాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆత్మకూరు డిఎస్పి రామాంజనేయులు నాయక్, ఆధ్వర్యంలో నందికొట్కూరు అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును నిర్వహించారు.

మంత్రిని కలిసిన ఉమ్మడి జిల్లా డీఎఫ్‌పీఎస్ చైర్మన్

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లా డిఎఫ్.సిఎస్ చైర్మన్ బీఎస్ నవీన్ కుమార్ విజయవాడలోని మంత్రి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రికి వివరించారు. ముఖ్యంగా, శ్రీశైలం రిజర్వాయర్‌లో సీడ్ స్టాకింగ్ కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు 2 కోట్ల చేప పిల్లలను విడుదల చేసే అవకాశమున్నదని, దీనికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఈ చర్య మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేలా ఉంటుందని, వారి ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుందని బీఎస్ నవీన్ కుమార్‌గా తెలిపారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 401 గైర్హాజరు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ సెకండియర్ పరీక్షకు 20,925 గాను 20,499 పరీక్షకు హాజరై, 401 విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ గురువయ్య శెట్టి బుధవారం తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కింద ఇద్దరిని బుక్ చేసినట్లు ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

విశాలాంధ్ర-గూడూరు: ప్లాస్టిక్ కవరర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ కే రాఘవేంద్ర దుకాణ యజమానులను హెచ్చరించారు. బుధవారం నగర పంచాయతీలోని హోటళ్లు, షాపింగ్ మాల్స్, బేకరీలు, పలు దుకాణాలను మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ అధికారులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి హానికరమని, ప్లాస్టిక్ వాడడం తగ్గిస్తే కాలుష్యం నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగంలో దుకాణ యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - కోడుమూరు : వైసీపీ కన్వీనర్ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ అభిమానులు,వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని స్థానిక హేమాద్రి రెడ్డి కాంప్లెక్స్ నందు ఆ వైసిపి నాయకులు,కార్యకర్తలతో కలిసి మండల కన్వీనర్ రమేష్ నాయుడు వైస్సార్సీపీ జెండాను ఆవిష్కరించారు. మాజీ ముఖ్యమంత్రి,దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి,మాజీ ఎంపీటీసీ లింగన్న, రవికుమార్ రెడ్డి, లింగమూర్తి, సుబ్బారావుస్వామి, ధరణిరెడ్డి, పాలాక్షిరెడ్డి, జగదీష్, గోపి, రవిశంకర్, వీరన్న, వెంకట్రావు, నారాయణ, రవి, సురేష్, శ్యామ్, డీజే రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

విశాలాంధ్ర - కోడుమూరు: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం నిషేధమని, ఈ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమం అధికారి డాక్టర్ రఘు కోరారు. బుధవారం కోడుమూరు కో-లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వర్కూరు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధూమపాన రహిత దినోత్సవం సందర్భంగా ప్రజలకు ధూమపానం చేయడం వలన కలిగే అనర్థాల గురించి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మార్చి నెల రెండవ బుధవారం జాతీయ ధూమపాన నిషేధ దినం నిర్వహిస్తామన్నారు. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలు పోస్టర్లు, గోడపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమములో కో-లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్, ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప, హెల్త్ సూపర్వైజర్ కమాల్ సాహెబ్, సామాజిక ఆరోగ్య అధికారి ధరణి,ఆరోగ్య కార్యకర్త రమాదేవి, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలను కాపాడుకుందాం : డా.కె.అనంతరావు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: కిడ్నీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు రెండు సాధారణ పరీక్షలు ఉంటాయి. మూత్ర పరీక్ష, సీరమ్ క్రియాటినిన్ కొలత. 40 ఏళ్లు పైబడిన వారు, కుటుంబంలో కిడ్నీ వ్యాధి చరిత్ర ఉన్నవారు, మధుమేహం, రక్తపోటు లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు సంవత్సరానికి ఒక్కసారి ఈ పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసర మని కిమ్స్ వైద్యశాల డాక్టర్ కె.అనంతరావు అన్నారు. అంతర్జాతీయ కిడ్ని దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాకు కిడ్నీని ఎలా కాపాడుకోవాలో తెలియచేశారు. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ప్రపంచ వ్యాప్తంగా 85 కోట్ల మందిని ప్రభావితం చేస్తోంది. ప్రతి సంవత్సరం దాదాపు 30 లక్షల మంది ఈ వ్యాధితో మృతి చెందుతున్నారన్నారని వివరించారు. భారత దేశంలో సుమారు 78 లక్షల మంది సికెడితో బాధపడుతున్నారని, వారిలో ప్రతి సంవత్సరం 1.5 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో సికెడి వల్ల మరణాల శాతం 1.9శాతం నుండి 3శాతానికి పెరిగింది తెలిపారు. ఈ మరణాల్లో అధిక శాతం రీనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ అందుబాటులో లేకపోవడం వల్లనే జరుగుతోందన్నారు. సికెడి ప్రగతిని తగ్గించేందుకు కొత్త మందులు అందు బాటులోకి వచ్చాయన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులు సికెడి మందుల గురించి అవగాహన కలిగి ఉండటం, ప్రజల్లో కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచడం, చికిత్స కోసం సరైన సౌకర్యాలు కల్పించడం, ఎక్కువ మంది నెఫ్రాల జిస్టులు అందుబాటులో ఉండటం అత్యవసర మన్నారు. ముదిరిన దశలో కిడ్నీ వ్యాధికి రెండు ప్రధాన చికిత్సా మార్గాలు ఉన్నాయి. డయాలిసిస్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్. వీటిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ అత్యుత్తమంగా పరిగణించబడుతుంది, ఇది డయాలిసిస్‌తో పోలిస్తే జీవన నాణ్యతను మెరుగుపరిచే అవకాశం ఉందన్నారు. రక్తపోటును 130/80 ఎంఎం హెచ్‌జీ కంటే తక్కువగా ఉంచుకోవడం, హెచ్‌బిఏ1సి స్థాయిని 7శాతం లోపుగా ఉంచుకోవడం, జీవనశైలిలో మార్పులు, పొగ త్రాగడం, మద్యం సేవించడం మానుకోవడం, బరువు తగ్గించడం, ప్రోటీన్ తీసుకునే పరిమాణాన్ని తగ్గించడం, ముఖ్యంగా మాంసాహారం పరిమితం చేయడం, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు మందులు వాడటం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించుకోవాలన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులు మరియు ప్రజలకు కిడ్నీ వ్యాధి గురించి అవగాహన కల్పించాలి ప్రారంభ దశలోనే కిడ్నీ వ్యాధిని గుర్తించేందుకు పరీక్షలను తప్పనిసరి చేయాలన్నారు. అధిక నాణ్యత గల కిడ్నీ సంరక్షణ సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని, సికెడి ప్రగతిని నియంత్రించే మందులపై అవగాహన కల్పించాలని, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు లో అన్ని రకాల నెఫ్రాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

వైభవోపేతంగా శ్రీ ప్రహ్లాద వరదస్వామి, అమృతవల్లి అమ్మవార్ల కళ్యాణోత్సవం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో శ్రీ ప్రహ్లాద వరద స్వామి, అమృతవల్లి అమ్మవార్ల కళ్యాణోత్సవం బుధవారం రాత్రి వైభవోపేతంగా జరిగింది. అహోబిలం 46వ పీఠాధిపతి సమక్షంలో అహోబిలం మఠం జనరల్ మేనేజర్ మురళీధరన్, జాబితా సలహా సభ్యులు వైకుంఠం, మనియార్, అడ్మినిస్ట్రేషన్ సుదర్శన్‌ల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కిడాం బి.వేణు గోపాలాచార్యులు శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు ఉదయాన్నే పద్మశాలి సంఘం వారు ఉభయ దారులుగా వ్యవహరించి అభిషేకంలో పాల్గొన్నారు. సాయంత్రం ఉచ్చ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పల్లకిలలో కొలువుంచి అర్చకులు ఎదుర్కోల కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు స్వామి అమ్మవార్ల పూలమాలలను తలపై ఉంచుకొని నృత్యం చేసిన తీరు చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ఊరేగింపుగా కళ్యాణ మండపం వద్దకు చేరుకున్న స్వామి అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం పీఠాధిపతి స్వామి ఆధ్వర్యంలో కళ్యాణం తంతు గావించారు. సాంప్రదాయం ప్రకారం నాంది, పురుష సూక్తం, ఉపనయనాది కార్యక్రమాల తంతు ముగియగానే కంకణ ధారణ, జీలకర్ర బెల్లం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది తిలకిస్తుండగా మాంగల్య ధారణ తంతు జరిగింది. అనంతరం స్వామి అమ్మవార్ల పాదాల చెంతన అర్చకులు ముత్యాల తలంబ్రాలు పోశారు.

ఎగువ అహోబిలంలో : ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా తొమ్మిదవ రోజైన బుధవారం ఉత్సవమూర్తి శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుంచి ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు తొట్టి తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను తొట్టిలో కూర్చుండబెట్టి పూజలు నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై శ్రీ జ్వాలానరసింహస్వామి కొలువుదీర్చి మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు అహోబిలంలో : ఎగువ అహోబిలంలో గురువారం శ్రీ జ్వాల నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. దిగువ అహోబిలంలో ఉదయం కాలింగ నర్తన ఉత్సవం, సాయంత్రం తొట్టి తిరుమంజనం, రాత్రి అశ్వ వాహన సేవా కార్యక్రమాలు ఉంటాయి.

దిగువలో కళ్యాణం.. రమణీయం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి, అమృతవల్లి అమ్మవార్ల కళ్యాణోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అహోబిలం 46వ పీఠాధిపతి సమక్షంలో అహోబిలం మఠం జనరల్ మేనేజర్ మురళీధరన్, జాబితా సలహా సభ్యులు వైకుంఠం, మనియార్, అడ్మినిస్ట్రేషన్ అధికారి సుదర్శన్‌ల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలాచార్యులు శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పల్లకిలో కొలువుంచి అర్చకులు ఎదుర్కోల కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు స్వామి అమ్మవార్ల పూలమాలలను తలపై ఉంచుకొని నృత్యం చేసిన తీరు చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ఊరేగింపుగా కళ్యాణ మండపం వద్దకు తీసుకొని వచ్చిన స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం పీఠాధిపతి స్వామి ఆధ్వర్యంలో కళ్యాణం తంతు గావించారు. వేలాది మంది తిలకిస్తుండగా మాంగల్య ధారణ తంతు జరిగింది. అనంతరం స్వామి అమ్మవార్ల పాదాల చెంతన అర్చకులు ముత్యాల తలంబ్రాలు పోశారు.

ఎగువ అహోబిలంలో: ఎగువ అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా తొమ్మిదవ రోజైన బుధవారం ఉత్సవమూర్తి జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుంచి ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు తొట్టి తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను తొట్టిలో కూర్చుండబెట్టి పూజలు నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై జ్వాలానరసింహస్వామి కొలువుదీర్చి మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా వైసీపీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : స్థానిక వైసిపి కార్యాలయంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, తాలూకా వైసిపి నాయకులు భూమా కిషోర్ రెడ్డిలు నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గంగుల నాని వైసీపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఆవిర్భవించి 15 సంవత్సరాల అయిందన్నారు. వైసిపి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే పాటుపడడం జరిగిందన్నారు. వైసిపి చెప్పిందంటే చేసి చూపిస్తారని ప్రజల నమ్మకం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోట్లూరు సుధాకర్ రెడ్డి, చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు, డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, గోపాల్, రమేష్ గౌడ్, కేకే తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వామి వారి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీ చెన్న సోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చెన్న సోమేశ్వర స్వామి సతీ సమేతంగా కొలువైన పార్వతీదేవి, గంగాదేవి చాముండేశ్వరి దేవి దేవత మూర్తులను సోమ, మంగళ, వారాల్లో ప్రబలపై ఊరేగించి గంగ గౌరీ సమేత స్వామి వారి కళ్యాణోత్సవం, గురువారం అనగా తెల్లవారితే శుక్రవారం రోజున స్వామివారి రథోత్సవాన్ని అశేష భక్తజన సందోహం మధ్య నిర్వహిస్తారు.

స్వామివారి చరిత్ర ఇలా ఉంది : పూర్వం తాండ కులస్తులు గ్రామ గ్రామాన బ్రతుకుతూ పశువులను మేపుకుంటూ పోలకల్ గ్రామానికి చేరుకొని, పశువులను గాడికి కట్టివేసుకుని రాత్రి నిద్రిస్తుండగా తాండ వారి పశువుల గాడిలో శ్రీ సోమేశ్వర స్వామి లింగమై వెలసినట్లు అక్కడి శాసనాలు తెలుపుతు న్నాయి. 1819వ సంవత్సరం శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన సేనాధిపతి నాగమనాయులు దండయాత్ర చేసి, తిరుగు ప్రయాణంలో అక్కడ బస చేసి, పూజలు నిర్వహించినట్లు శాసనాలు తెలుపుతు న్నాయి. తిరిగి అక్కడ నుండి వెళ్లేటప్పుడు స్వామివారి ఆలయం నిర్మానింపజేసి ఆలయ జీర్ణోదరణకు, ఆలయ అభివృద్ధికి, స్వామివారి పూజలకు వందలాది ఎకరాల భూమిని స్వామి వారికి అప్పగించి వెళ్లినట్లు అక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. ఆ భూములను నేటికీ స్వామివారికి పూజలు నిర్వహించే వివిధ కుల వృత్తుల వారు అనుభవిస్తూ స్వామి వారికి సేవలు చేస్తున్నారు. స్వామివారి రథోత్సవం సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి రథోత్సవం రోజున రంగురంగుల బాణ సంచాలతో కాముడి దహనం చేయడం భక్తులను ఎంతగానో ఆ కట్టుకొంటాయి.

అశేషంగా హాజరుకానున్న భక్తులు: స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారు. శ్రీ చెన్న సోమేశ్వర స్వామి వారి రథోత్సవాన్ని తిలకించడానికి మన జిల్లా నుండే కాక తెలంగాణ రాష్ట్రం, కర్ణాటక రాష్ట్రం, తదితర ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి మొక్కుబడులు తీర్చుకొని స్వామివారి కృపకు పాత్రులవుతారు. ఈ స్వామివారి రథోత్సవ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోడుమూరు సిఐతో పాటు సి.బెళగల్ ఎస్సై ఎం తిమ్మారెడ్డి తమ సిబ్బంది ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు.